నాపేరు రాయొద్దు

ఎప్పుడో పట్టణ శివారున కట్టిన కాన్వెంట్, చుట్టూరా నివాస గృహాలు, పరిశ్రమలు, కార్యాలయ భవనాలు, హోటళ్ళు, సినిమా థియేటర్లు, గుళ్ళు, మసీదులు, చర్చిలు పెరుగగా కొత్త కొత్త రోడ్లతో ఇప్పుడు కాన్వెంట్, నగరం మధ్యలో కొచ్చినట్లయింది.

ప్రభుత్వపు గ్రాంటుకు ఆశించని ఈ కాన్వెంట్‌పై అధికారుల పలుకుబడి నడవదు. నాయకుల పైరవీలు నడవవు. అందుకని అందులో క్రమశిక్షణతో కూడిన చదువు చెపుతారు.

చాలామంది తమ తమ పిల్లలను ఆ స్కూల్లోనే చదివిం చాలని ఉబలాట పడుతుంటారు. అందరిలాగే శిరీష తన ఒక్క గా నొక్క కూతురు గీతను, అందులోనే చదివించాలని నిర్ణ యించుకుంది.

ఉదయం స్కూల్ టైమ్ కల్లా గీతను వెంటబెట్టుకుని స్కూల్ ఆవరణలో అడుగు పెట్టేసరికి, ఒకేరకం డ్రెస్‌లో పిల్ల లంతా పావురాల గుంపు భూ మ్మీదకు దిగినట్లు అనిపించింది. సన్నని నవ్వులు, నిష్టురపు కొట్టుకోవడాలు, నిలదీసి అడగడాలు, సినిమా ముచ్చట్లు ఒకటేమిటి? రక రకాల కబుర్లు. తల్లిచేయి వదిలి రేపటి నుంచి తాను వీళ్ళతో ఆడుకోవచ్చు అని ఏదో కొత్త లోకాన్ని కనుక్కున్నట్లు నిలుచుంది గీత.

వెనక్కు చూసిన తల్లి మళ్ళీ గీత వేలు పట్టుకుని "పద" అంటూ ప్రిన్సిపాల్ రూమ్ వైపు నడిచింది.

ప్రిన్సిపాల్ ఫ్లవర్ వాజ్‌లో తెల్లని లిల్లీ ఫ్లవర్‌లా, తన కుర్చీలో కూర్చొని పిల్లల ప్రోగ్రెస్ కార్డ్సు మీద సంతకాలు చేస్తూంది.

ఆమె తల మీద గోడకు మేరీ మాత బొమ్మ అమర్చి ఉంది. ఎదురుగా టేబుల్ మీద ఓ గ్లోబ్, దాని ప్రక్కనే శిలువ గుర్తు, మరో పక్క కొన్ని రిజిష్టర్లు. వాటి మీద రెండంగుళాల పేపరు వెయిట్, కాలింగ్ బెల్ ఉన్నాయి.

గీత చేయిపట్టుకొని శిరీష లోనికి వస్తూ "గుడ్ మార్నింగ్ మిస్" అంది.

"మార్నింగ్" అంటు ఎదురుగా విజిటర్స్ కోసం ఉంచిన కుర్చీల వైపు చూపిస్తూ "ప్లీజ్ బీ సీటెడ్" అంది.

"థ్యాంక్యూ" అంటూ కూర్చుంది.

రాయడం ఆపి పెన్ను కాగితాల మీ దుంచి శిరీషను ఉద్దేశిస్తూ "చెప్పండి" అంది.

పక్కన ఉన్న గీతను తన ఒడిలోకి లాక్కుంటూ, "నా కూతురును స్కూల్లో చేర్పించాలని."

"ఖాళీలు లేవు" అంటూ పెదవి విరిచింది.

"ఎలాగైనా ఒక్క-"

"నో-నో!"

"దయచేసి - ఒక్క సీటు - నేనే మధ్యలో చదువును ఆపేసి బతుకును బండల పాలు చేసుకున్నా. నా బిడ్డ అలా కాకూడదు, బాగా చదువుకుని"

"సారీ!"

"మంచి స్కూల్లో వేస్తే బాగా చదువుతుంది. అని ఆశ, కాదనకండి. ప్లీజ్" అంటూ దోసిలి పట్టింది. దీనంగా శిరీష.

"అందరూ ఒక్క సీటు, ఒక్క సీటు అంటే ఎలా, అడిగే వాళ్ళకు ఒక్కటే కావచ్చు కానీ అడిగిన వాళ్ళందరికీ ఇస్తే -

ఇక క్లాసులెలా నడప గలం? అప్పుడు మీరు ఆశించే మంచి చదువు పిల్లలకు అందివ్వ లేము.

శిరీష మాట్లాడలేదు. ఆ ముఖంలో ఇంతకుముందున్న కళ పోయి నిరాశ నిండుకుంది.

"మీరు ముందే ఎందుకు ప్రయత్నం చేయలేదు?" అంటూ టేబుల్ మీది శిలువ వైపు చూసి కాసేపు ఆరూపాన్ని కళ్ళల్లో దాచుకున్నట్లు కళ్లు మూసి తెరిచింది.

శిరీష మౌనంగా ఆలాగే కూర్చుంది.

"పోనీ వచ్చే సంవత్సరం వరకు ఆగండి. అప్పుడు ఆలోచిద్దాం" అంది.

"మీ ఇష్టం. నాకో అడ్మిషన్ ఫారం ఇప్పిస్తే చాలు, మీరు ఎప్పుడు జాయిన్ చేయమంటే అప్పుడే చేస్తాను."

"హుఁ" అంటూ లేచి అల్మారాలో నుంచి ఓ అడ్మిషన్ ఫారం తీసి దాని పై భాగాన ఓ పక్కకు సంతకం చేసి ఇస్తూ "దీన్ని నింపి, మీవారి సంతకం చేయించి తీసుకురండి" అంటూ ఫారం శిరీష కిచ్చి టేబుల్ మీద బెత్తాన్ని చేతిలోకి తీసుకొని బయటకు నడుస్తుంటే– "వారు ఊళ్ళో లేరు. వారి సంతకమే కావాలా?' అంటు ఆతురతగా ఆమె వెంట నడుస్తోంది.

"అడ్మిషన్ గద, ఫాదర్‌దే కావాలి.'

ఫస్ట్ బెల్ మోగింది.

పిల్లలందరూ ప్రార్థన కోసం లైన్‌గా నిలుచుంటున్నారు. మిస్ అటు వైపు పోగా శిరీష గేట్ వైపు నడిచింది. ఆమె వెంట గీత.

* * *

మలక్‌పేట లోని టీ.వీ. టవర్ పక్కన రెండొందల గజాల విస్తీర్ణంలో అందంగా నిర్మించిన ఓ చిన్న ఇల్లు. చుట్టూరా ప్రహారీ గోడ, రోడ్డు వైపు ఓ గేటు. గేటు నుంచి మెయిన్ డోర్ వరకు రంగురంగుల నాపరాతి ముక్కలు పరచిన బాట. బాటకిరువైపులా పూలకుండీలు, మల్లెపొదలు, రెండు మెట్లెక్కి లోపలికెడితే ఓ హాలు, హాల్లో కేన్ సోఫాలు, వాటిలో ఎంబ్రాయిడరీ అల్లిన మెత్తని కుషన్స్, మధ్యన టీపాయ్, దాని మీద ఫ్లవర్ వాజ్, ఆ హాల్‌ను ఆనుకొని డ్రెస్సింగ్ రూమ్, కుడి వైపు డైనింగ్ హాల్, దాని ప్రక్కనే కిచన్, వాటి వెనక కొంచెం ఖాళీ స్థలం. అన్ని సౌకర్యాలున్న ఆఇంటిని పదేళ్ళ క్రితం రాజారావు తాను యం.ఎల్.ఏ గా ఉన్నప్పుడు ఊరి నుంచి వస్తే ఉండటానికి కట్టించుకున్నాడు. కానీ యం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లోనే ఉండి యం.పి. అయ్యాక బంజారా హిల్స్ లో మంచి బంగళా కట్టించుకున్నాడు.

పెద్ద పెద్ద కంపెనీల్లో షేర్స్ కొని పెద్ద ధనవంతుడైనాడు. ఎక్కువ డిల్లీలోనే మకాం. ఎప్పుడన్నా హైదరాబాదుకు వచ్చినప్పుడల్లా ఈ ఇంటికొస్తే "కిరాయి అడగడానికి వచ్చాడని" కొందరు, "శిరీష కోసం వచ్చాడని" మరికొందరు. ఎవరు ఏమన్నా అతను పిల్లి లాగే వచ్చి పిల్లి లాగే వెళ్ళిపోతుంటాడు. కొన్నాళ్ళ నుంచి రావడమూ మానేసినట్టుంది.

* * *

ఆ రోజు సాయంత్రం వేళ శిరీష మల్లెలను తెంపు తోంది.

తిరపతమ్మ గేట్ తెరచుకుని లోపలి కొచ్చింది. పూలు ఏరటం ఆపి తిరపతమ్మకు ఎదురుపోయింది శిరీష. తిరపతమ్మ శిరీషకు దూరపు చుట్టం.

అరవై ఏళ్ళ కాకరపండు లాంటి తిరపతమ్మకు ఎవరూ లేరు. కాబట్టి శిరీషతోనే ఉంటుంది. తాను తెచ్చిన కవర్ శిరీషకిస్తూ "ఆయన నాల్గు రోజు లుండి పొమ్మంటే తప్పలేదు."

"పరవా లేదు. సంతకం చేశారా?" అంటు కవర్ విప్పింది. సంతకం చేయలేదు. దానితోపాటు కొన్ని డాక్యు మెంట్స్ "ఇవేమిటి?" అన్నట్టు చూసింది.

"మనం ఉంటున్న ఇంటిని నీ పేర రిజిస్ట్రేషన్ చేసి ఈ కాగితాలు ఇచ్చాడు."

"ఏ మన్నారు?"

"తన పేరు రాయొద్దన్నాడు."

"ఇంకా....!"

"ఇంకా తనను మరచిపొమ్మని కూడా చెప్పాడు."

కొంతసేపు నిశ్శబ్దం చోటు చేసుకుంది. పదిహేను ఏళ్ళ బాల్యం ఎలా గడచిందో గుర్తు లేదు కానీ ఆ తర్వాత పదిహేను ఏళ్ళ ప్రతి క్షణం గుర్తుంది.

"పాప లేదూ?" మాటలు మార్చడానికి.

"బయటికి ఆడుకోవడానికి వెళ్ళింది."

"నేను కాఫీ పెడతాను." అంటూ వంటగది వైపు నడిచింది తిరపతమ్మ.

శిరీష తలనిండా ఆలోచనలే.

చదువు పూర్తి కాగానే పెళ్ళి చేసుకుంటే ఈనాడు సమస్య లుండకపోయేవి. మగవాళ్ళతో పాటు సమంగా బతకాలని ఏవేవో ఆశయాలతో సంఘ సేవ అని తిరిగి, తిరిగి అలసినప్పుడు స్వార్థపరులు అదీ, ఇదని ఆశలు చూపించి ఒంటరితనాన్ని తమకు అనుకూలంగా మార్చుకొన్నారు. ఈనాడు అవసరానికి ఏ ఒక్కరూ నిలవరు.

* * *

పిల్లలంతా ఒకరి వెనక ఒకరు గింజల్ని మోసుకు పోతున్న ఎర్ర చీమల బారుల్లా కాన్వెంట్ ఆవరణలోకి వెడుతున్నారు - కేజీల కొద్దీ బరువు ఉన్న పుస్తకాల సంచు లను ఈడ్చుకుంటూ.

గేటు కెదురుగా రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిల్చుంది శిరీష - అప్పుడే కొమ్మ నుంచి రాలిపడి ఉన్న జామ పండులా, చేతిలోని కవర్‌లో పాప అడ్మిషన్ ఫారం. రెడ్డిగారి రాకకోసం ఎదురు చూస్తోంది. ఏ వెహికిల్ శబ్దమైనా ఆయన కారే వస్తున్నట్లు అనిపిస్తుంది ఆమెకు. కానీ కాదు.

నిమిషమొక రోజనిపిస్తుంది. అతన్ని చూడక చాలాకాలమైంది. పాప పుట్టక ముందు అతని కోసం ఇలాగే ఎదురు చూసే క్షణాలు గుర్తొచ్చాయి.

తన కోసం ఆయన పడిగాపులు కళ్ళ ముందు కదిలాయి. ఏదో మధుర భావం ఆమె పెదాల పైన పూసింది.

అంతలో దూరంగా ఎర్ర రంగు మారుతి కారు కాలువ నీటిలో కొట్టుకొస్తున్న ఎర్ర మందార పువ్వులా వస్తూంది.

శిరీష తలనిండా కొంగు కప్పుకుంది.

అనుకున్నట్టుగా తాను నిలుచున్న చెట్టు కింద కారాగింది. కానీ కారులో ఉండవల్సిన వారు లేరు. ఆధునికతను అచ్చుపోసినట్టుగా ఉన్న ఓ పాతికేళ్ళ యువతి దిగగానే డ్రైవర్ కారును కొంచెం ముందుకు తీసుకెళ్ళి పార్కు చేసాడు.

శిరీషకు ఏం అర్థం కాలేదు. బొమ్మలా నిలుచుని చూస్తూంది.

ఆ యువతి శిరీష దగ్గరగా వచ్చి నిలుచుని "నమస్తే మీరు శిరీషగా రనుకుంటా."

"అవును." చేతులు జోడిస్తూ అంది శిరీష.

"నేను రెడ్డి అండ్ కంపెనీ నుంచి వచ్చాను. రెడ్డి గారు పంపించారు. నేను వారి దగ్గర అకౌంట్స్ మేనేజర్ని"

కార్యాలయాల్లో పనిచేసే స్త్రీలకుండే చొరవ, కలుపుగోలు తనంతోపాటు కార్యాన్ని గట్టెక్కించే చలాకీతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉంది ఆమెలో.

"అలాగా" అంటూ నవ్వును మొహాన పులుముకుంది.

"మా బాస్ ఈ రోజు మధ్యాహ్నం కాంట్రాక్టు పనిమీద కెనడా వెళుతున్నారు. అర్జంట్ వ్యవహారాలు చూడడంలో నిమగ్నమైనందు వల్ల నన్ను పంపుతూ, ఈ కవర్‌ను మీ కివ్వమన్నారు." అంటూ తాను తెచ్చిన సీల్డ్ కవర్‌ను శిరీష కిచ్చింది.

"నిన్న మీరు ఫోన్ చేసినప్పుడు వారే వస్తామన్నారట, కానీ వీలు పడలేదు. మరోలా భావించ వద్దన్నారు."

శిరీష మౌనం వహించింది.

"తోటి స్త్రీగా నాదో సలహా, ఇప్పటికే మీరు దగాపడ్డట్టున్నారు. గతాన్ని మరచిపోండి. రేపటి కోసం ఓ రూపును ఊహించుకొని బతకండి. ఈ కవర్‌లో సంతకం చేసిన ఓ బ్లాంక్ చెక్ కూడా ఉంది. మీరు ఎన్ని లక్షలకు రాసుకుంటారో, రాసుకుని, డ్రా చేసుకుని, మీ పేరు మీద బ్యాంకులో వేసుకోండి. అంతే కాని అర్థంలేని ఆవేశంతో చేతికి అందిన అవకాశాన్ని వదులుకోవద్దు. భర్త భార్యకిచ్చేదీ డబ్బే. విటుడు వేశ్యకిచ్చేది డబ్బే. ఏదో హోదాలో ఎప్పుడూ డబ్బు పురుషుడి నుంచి స్త్రీకి వస్తూనే వుంటుంది. వాడుకోండి అంతే. మరి సెలవా?" అంటు కుడి చేతిని గాలిలో ఊపింది.

శిరీషకు నోట మాట రాలేదు. కానీ ఆమె చేతులు వాటం తట అపే నమస్కరించాయి.

అమె కారు వైపు వేగంగా నడిచిపోయి, సీతాకోక చిలుక మందారపు పూరేకుల్లో ఇమిడి పోయినట్టు కారులో కూర్చుంది. కారు కదిలి పోయింది.

శిరీష కాళ్ళు కదలడం లేదు. కళ్ళ నిండా నీరు తిరిగి బుగ్గల మీద నుంచి జారి, చెక్కిలి దగ్గరి పెదవి మలుపులో ఆగి చుక్కలు చుక్కలుగా రాలుతున్నవి.

కవర్ విప్పింది. అందులో చెక్కుతో పాటు చిన్న స్లిప్ పైన- "నాపేరు రాయొద్దు" అని రాసి ఉంది. కసిగా స్లిప్‌ను నలిపి పారేసి వడి వడిగా నడిచింది. అప్పుడామె కళ్ళు కోపం తో ఎరుపెక్కాయి. వళ్ళు కసిగా కదులుతూ ఉంటే ముక్కు పుటాల్లో నుండి వేడి శ్వాస బయటికొస్తుంది.

* * *

జర్నలిస్ట్ కాలనీలో ఓ చిన్న ఇంటి గేట్ పిల్లర్‌కు 'ఎం. మురళి, జర్నలిస్ట్' అని బోర్డు ఉంది.

గేట్ ముందు నిల్చున్న శిరీష గేట్‌ను వేళ్ళతో శబ్దం చేసింది.

వరండాలో కూర్చొని రాసుకుంటున్న వ్యక్తి రాయడం ఆపి పెన్నును అలాగే పట్టుకొని ఎడమ చేత్తో కళ్ళద్దాలను

సవరించుకుంటూ లేచి గేటు వైపు నడచి శిరీషను గుర్తించి విప్పారిన ముఖంతో "రండి, రండి" అంటూ గేటు తెరచాడు. నలభై ఏళ్ళ వయస్సుకు, ఆరడుగుల ఎత్తుకు లాల్చీ, పైజామా ను వేశాడు.

''నమస్కార మండీ'' అంటూ ఆమె లోనికి రాగానే గేటును మూస్తూ "ఎన్నాళ్ళకు దర్శనం?" కళ్ళద్దాలను సవరించుకుంటూ అడిగాడు.

"మీకు నేను గుర్తుకు రాకపోయినా, నాకు మీరు గుర్తొస్తారు." అంటూ వరండాలోకి నడిచివెళ్ళే అతన్ని అనుసరిస్తూ ఆమె వరండాలోకి చేరింది.

"కూర్చోండి'' అంటూ కుర్చీని చూపిస్తూ తాను కూర్చున్నాడు.

ఆమె కూర్చుంది.

''ఏమిటి విశేషాలు, గీత బాగుందా?''

"మీరు గీత అని ఏమని పేరు పెట్టారో ఆనాటి నుంచి దాని గీత బాగున్నట్టు లేదు.''

"అంతే?" అంటూ చేతిలోని పెన్నును ఎదురుగా టీపాయ్ మీద క్రితంలో రాసి ఉంచిన పేపర్స్ మీద పెట్టి కాస్త కంఫర్టబుల్‌గా కూర్చున్నాడు.

"దానికిప్పుడు ఐదేళ్ళు, స్కూల్లో చేర్పించాలి."

"చేర్పించాలిగా?" రెండు చేతుల వేళ్లనూ ఒకద్దగ్గరికి చేర్చి పెదాలను తాకిస్తూ రెప్పకొట్టకుండా శిరీషనే చూస్తున్నాడు.

"ఏమిటి అలా కొత్తగా చూస్తున్నట్టు చూస్తున్నారు?"

"రోజు రోజుకూ నీలో కొత్త అందం చోటు చేసుకుంటూందని."

"మాటలతో మత్తెక్కించకండి."

"నా దగ్గర ఉన్నవి అవే కదా."

"మనస్సు లేదా?"

మురళి కళ్ళద్దాలు తీసి టీపాయ్ మీద వుంచి ఓ సారి కళ్ళను ఒత్తుకొని మౌనంగా నీళ్లు నమలసాగాడు.

"నే నీ మధ్య ఓ కవిత రాశాను." టీపాయ్‌పై చూపుడు వేలుతో రాస్తు.

"అచ్చా ఏదీ చదవండి?" అంటూ శ్రద్ధగా వినడానికి సర్దుకున్నాడు.

శిరీష కవితను గుర్తు చేసుకుంటూ ఏకాగ్రతలోకి వెళ్లి పోయింది. ఆమెనే చూస్తున్న మురళి ఏదేదో లోకాల్లోకి వెళ్లిపోతూ_

పసిడిని పాలల్లో కరిగించి పోత పోసిన రూపం. ఆమె

నవ్వితే వెన్నెల పరుచుకుంటుంది. ఆమె మాట్లాడితే పూలు చల్లినట్టుంటుంది. ఆమె చూపులు ఎదుటి వాళ్ల కనురెప్పలను నిలేస్తాయి- అనుకుంటూ తాను తన కనురెప్పలను ఆడించడం మరచి పోయి చూస్తున్నాడు.

"నా హృధయాన్ని అడిగిన వాళ్ళందరికీ
అంగుళం చోటు లేకుండా పరిచాను.
తీరా చూస్తే నాకోసం ఖాళీ లేదు.
తిరిగిఅడుక్కోవడానికి ప్రతి తలుపు తట్టాను.
ఏ తలుపూ తెరచుకో లేదు!"

అంటూ ముగించిన శిరీష కళ్ళ నుండి జారిన కన్నీరు టీపాయ్ మీద చుక్కలు చుక్కలుగా పడ్డవి.

"బాగా రాశావు! బాగుంది."

"నిజమా?" అంటూ మురళి వైపుచూసింది తలెత్తి. గుండెలో నుంచి వచ్చే దుఖంతో ఆమె ముఖం ఎరుపెక్కి పోయింది.

"ఏడుస్తున్నావా?" మురళి ఆమె గడ్డం కింద చేయి పెట్టి పైకెత్తి ముఖంలో చూశాడు. రాలడానికి సిద్దంగా ఉన్న కన్నీళ్ళు అతని అరచేతిలో రాలాయి.

శిరీష మౌనంగా మురళి కళ్ళలోకి చూసింది. అప్పుడామె కనురెప్పలు వర్షంలో తడిచిన అరటి ఆకు అంచుల్లా ఉన్నాయి.

"నిన్ను బాధ పెట్టానా?"

"లేదు. ఉన్న బాధ మిమ్మల్ని చూడ గానే పొంగి పొరలింది." కొంగుతో కళ్ళు బుగ్గల్ని వొత్తుకుని ఓ బరువైన శ్వాసను ఒదిలి. తడసిన కొంగును చూస్తూ "నా కవితను అర్థం చేసుకున్నారనుకుంటా."

" ఆ చాలా గొప్పగా ఉంది. "

శిరీష ఏడవ లేక నవ్వింది.

గీతను స్కూల్లో చేర్పించాలి.

"చేర్పించండి."

''దాని అడ్మిషన్ ఫారంమీద తండ్రిసంతకం కావాలట.''
విషయం అర్థమైంది. మరోసారి నీళ్ళు నమిలాడు.

"నాకు తెలిసిన వాళ్ళను అడిగాను. ఒకరు భవంతిని బహుమతిగా ఇచ్చారు. మరొకరు బ్లాంక్ చెక్ రాసిచ్చారు. కానీ తమ పేరు తండ్రిగా రాయొద్దు అన్నారు.'' అంటు మురళి వైపు చూసింది.

మురళి రాసి ఉంచిన కాగితాల వైపూ, తెరచి ఉంచిన పెన్ వైపూ చూస్తున్నాడు. వరండా కప్పు భాగంలో మూలన పిచ్చుక పిల్లలు గూట్లో నుంచి నిక్కి మేత కోసం వెళ్ళిన తల్లి–తండ్రిపిచ్చుకల కోసం అరుస్తున్నవి.

అది గమనించిన శిరీష "అటు చూడండి" అంది.

ఆలోచనల నుంచి తేరుకొని కదిలి కూర్చుంటూ, పిచ్చుకల

పిల్లలను చూస్తున్నాడు. అంతలో రెండు పిట్టలు ముక్కున కరిచి తెచ్చిన మేతను పిల్లలకు పెడుతూ ఉంటే అవి అదో మాదిరిగా శబ్దం చేస్తున్నవి అది పొట్టలు నిండుతూంటే ఆకలి తీరుతున్న శబ్దం. అది మమకారంతో అల్లుకు పోతున్న శబ్దం. ఆప్యాయతను అందుకుంటున్న శబ్దం. ప్రేమతో మూల్గుతున్న శబ్దం.

మురళి పెన్ను వైపు చూశాడు. తెరిచి వుంచివుండడం వల్ల పాళీపైన సిరా ఆరిపోయి మరక కట్టింది.

"ఆఁ ఇంకా చెప్పండి."

"నేను మీకు చెప్పవలసిన దాన్ని కాదు, అడగడాని కొచ్చాను."

"అడగండి."

"మీరు అడ్మిషన్ ఫారం పైన సంతకం చేయండి."

ఏదో సుడిగాలి మురళిని చుట్టేసినట్టు అనిపించింది. తన ఆదర్శాలు పేజీలు, పేజీలుగా దూది పింజల్లాగ గాలిలో ఎగురు తున్నట్టు అనిపించింది.

ఇందాక పాళీ పైన సిరా ఆరిపోయినట్టే ఇప్పుడు తన నోటిలో తడి ఆరిపోయింది. కుర్చీలోకి ఒరిగి కణతలను ఒత్తుకున్నాడు. దవడలను అదుముకున్నాడు. తలవెంట్రుకల్లోకి చేతులు అడ్డదిడ్డంగా ఆడించుకుంటున్నాడు. తానీ ప్రపంచంలో వున్నాడా అని అనుమానపడుతున్నాడు.

"మిమ్మల్ని బాధ పెట్టానా?" అమాయకంగా అడిగి అక్కడ ఆవరించిన మౌనాన్ని బద్దలు కొట్టి ....

"నేను మీకు"

"తెలుసు"

"గీత పుట్టుక"

"తెలుసు."

"మరిక వాళ్ళ లాగా నాకోరికను తృణీకరించరను కుంటా"

' కోరడం అత్యాశ ఏం కాదు. కానీ-"

"మీరు కూడా" మధ్యలో మాటలు ఆగిపోయాయి. కను రెప్పలు ఆడడం మానేశాయి. పెదాలు కలుసుకోవడం నిల్చి పోయాయి.

"సారీ శిరీషా"

మౌనంగా చూస్తు ' ఎంతో ఆశతో వచ్చాను."

"కానీ ముందే రావల్సింది?"

"ఇప్పు డేం మునిగింది?"

"ఒకరు బంగళా ఇచ్చారు. ఒకరు బ్లాంక్ చెక్ ఇచ్చారు. ఇప్పుడు. నీవు క్రితంలా లేని దానివి కాదు. ఉన్నదానివి"

' అంటే?"

"గీతకు తండ్రిగా ఆస్తిని ఆశించాననుకుంటుంది ప్రపంచం?"

"వాటన్నిటినీ వదులుకుంటాను."

"రాని దాని కోసం వచ్చిన దాన్ని వదులు కోవడం మంచిదా?"

ఇంతలో లంచ్ కోసం మురళి భార్య ఇద్దరు పిల్లలతో లోనికి వచ్చింది.

"ఈవిడ నా భార్య లత ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తుంది. వీడు రవి. ఇది కవిత-" శిరీషను మళ్ళీ భార్యకు చూపిస్తూ "ఈమె నా స్నేహితురాలు- ఈ మధ్య కవిత్వం రాస్తుంది" అనే లోపే శిరీష లేచినిలుచుంది.

ఒకరి కొకరు నమస్కరించు కున్నారు.

"రండి భోంచేస్తు మాట్లాడుకుందాం." శిరీష నుద్దేశిస్తూ అంటూ లోపలికినడిచింది లత. తల్లి వెంట పిల్లలు.

"నేను భోంచేసే వచ్చానండి."

"ఏదో కొంచెం" మురళి మాట పూర్తి కాక ముందే.

"థాంక్స్" అంటు గేట్ వైపు నడిచింది.

* * *

జర్నలిస్ట్ కాలనీ సిటి అవుట్ స్కర్ట్స్‌లో ఉండడం వల్ల అక్కడ ఆటోలు కనిపించడం తక్కువ. ఎప్పుడో కానీ బస్సులు రావు. అందుకని శిరీష మెయిన్ రోడ్ వైపు నడక సాగించింది.

ఆమె మనస్సు పరి పరి విధాల ఆలోచిస్తుంది. తాను చేసిన పొరపాటుకు తన చుట్టూరా ఎంతటి శిక్షావలయం అలుముకొని ఉందో ఇప్పుడు అర్థం అవుతోంది గీతను స్కూల్లో చేర్పించడం ఎలా?

ఎవరినైనా పెళ్ళి చేసుకుందే? ఎవరు చేసుకుంటారు? చేసుకుంటే ఇంకెన్ని సమస్యలు తలెత్తుతాయో.

ఒంటరిగా పోయేదాన్ని వచ్చి పోయే జనం ఓమాదిరిగా ఆగి, ఆగి, చూస్తున్నారు. ఆమె మాత్రం వడి వడిగా నడుస్తూంది. ఎండ నిప్పుల్ని వెదజల్లుతుంది. శిరీష తట్టుకోలేక రోడ్డు పక్కన ఉన్న ఓ వేప చెట్టు కింద నిలుచుంది. ఆ చెట్టుకు కొమ్మలు సరిగ్గాలేవు. దొంగలు దోచిన ఇల్లులా ఉంది. కొంగుతో ముఖం అద్దుకుంటున్నప్పుడు ఆమె చూపు ఎదురుగా ఉన్న గ్రేవ్ యార్డ్ మీద పడింది.

చుట్టూరా చిన్న కాంపౌండ్ వాలున్న ఆ శ్మశానంలో గోరీలు, వాటి తలపైపు వాళ్ళ తాలూకు వివరాలు చెక్కబడ్డ రాతి పలకలు నాటి ఉన్నాయి. ఇక్కడ నిద్రిస్తున్న వీళ్ళకు ఏ బాధలూ, ఏ బహిష్కరణలూ లేవు కదా! అందరికీ ఇక్కడ సమానమైన చోటు గదా అనుకుంది. గేటుకు ఇరువైపులా రెండు బోర్డులు వున్నాయి. ఒకదానిపైన "నీవు మనుషులు సృష్టించే బాధలకు భయపడకుము." మరొక దానిపై- "ఆత్మబలం అన్ని సమస్యలను జయిస్తుంది." అని రాసి వుంది.

శిరీషకి కాన్వెంట్ గుర్తొచ్చింది. అక్కడి ప్రిన్సిపాల్ గుర్తొచ్చింది. ఆమె రూంలో వున్న మేరీమాత బొమ్మ గుర్తొచ్చింది టేబుల్‌మీదున్న శిలువ బొమ్మ మరీ మరీ గుర్తొచ్చింది.

వెంటనే వెళ్ళి ప్రిన్సిపాల్‌ను కలిసి, గీత పుట్టుకను గురించి వున్నది వున్నట్టుగా చెప్పి తన బిడ్డ అడ్మిషన్ ఫారం పైన తండ్రి స్థానంలో తానే సంతకం చేస్తానని నిర్ణయించుకున్న ప్పుడు ఆమె కళ్ళల్లో కొత్త కాంతి కనిపించింది.

అంత వరకూ అలసటగా ఉన్న మనసు తేలిక అయ్యింది శరీరంలో కొత్త శక్తి చేరినట్టు కాగానే గ్రేప్ యార్డ్ వైపు కృతజ్ఞతతో చూస్తు మళ్ళీ నడక ప్రారంభించింది. దగ్గర అవు తున్న నగరం అరణ్యంలా కనిపిస్తుంది. అయినా ఆమె నడు స్తూనే వుంది.

○